ప్రజాశక్తి
సోమవారం 25 సెప్టెంబర్ 2023 5
అనంతపురం





సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు ఓబులు

పర్యావ[హా]రణం..!

భవిష్యత్తు తరాల బాగుకోసం పర్యావరణ పరిక్షణకు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. మొక్కలను నాటడం, వాటిని సంరక్షించడం లాంటి కార్యక్రమాలను అనేకం చేస్తుంటారు. ప్రజల్లోనూ దీనిపై చైతన్యం తెచ్చి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతుంటారు. పర్యావరణం బాగునకు వీరు ఇంతలా కష్టపడుతుంటే కొందరు రియల్టర్లు, పారిశ్రామిక వేత్తలు మాత్రం వారి స్వార్థం కోసం యథేచ్ఛగా మొక్కలను నరికేస్తున్నారు. పచ్చని చెట్లను నరికి దాని కలపను పరిశ్రమలకు తరలించి కాల్చిబూడిద చేస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని హిందూపురం తూముకుంట పారిశ్రామిక వాడలో నిత్యం ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. వీటిని నియంత్రించాల్సిన అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.



గోళాపురం పారిశ్రామిక వాడలోని వీర్‌గో పరిశ్రమలో కాల్చడానికి సిద్ధంగా ఉంచిన కలప

- యథేచ్ఛగా వృక్షాల నరికివేత
- పరిశ్రమల్లో కాలుతున్న కలప
- పారిశ్రామికవేత్తల దోపిడీ
- చోద్యం చూస్తున్న అటవీశాఖ
- మామూళ్ల మత్తులో నిబంధనలకు తూట్లు
- అటవీ శాఖకు నెలకు రూ.25 లక్షల ముడుపులు..?

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన, చెందుతున్న ప్రాంతంగా గుర్తింపు ఉంది. హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామికవాడల్లో దాదాపు 120 వరకు పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో ఫార్మా పరిశ్రమలతో పాటు ఉడ్ తయారు చేసే వీర్‌గో పరిశ్రమ, లేపాక్షిలోని సెర్‌డెనీం ప్యాంట్ల పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమకు అవసరమయ్యే చెట్లను ఈ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా నరికేస్తున్నాయి. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి వారికి సహకరిస్తున్నారన్న విమర్శలు వినపిస్తున్నాయి. చెట్లను నరికి కలపను తరలించే విషయంలో అటవీశాఖ, కాలుష్యనియంత్రణ మండలి, వాణిజ్య పన్నులశాఖలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అటవీశాఖకు పరిశ్రమలతో పాటు శామిల్స్ వారి నుంచి నెలకు సుమారు రూ.25లక్షల వరకు మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్లో రోజూ టన్నులకొద్దీ కలప కాలుతోంది. అటవీశాఖాధికారుల దయతో అంతభారీ ఎత్తున కలపవారికి లభిస్తోంది. రోజురోజుకూ పారిశ్రామిక వాడ, సమీప ప్రాంతాల్లో చెట్లు తరిగిపోతుండడంతో పర్యావరణ సమతుల్యతకు విఘాతం ఏర్పడుతోంది. పరిసర గ్రామాల పరిధిలో భూగర్భజలాలు సైతం విషరసాయనాలతో నిండి భూమిమొత్తం నల్లగా మారిపోతోంది. రైతులు సాగుచేస్తున్న పంటలు సైతం కాలుష్యం దెబ్బకు బీడుగా మారిపోతున్నాయి. హిందూపురం సమీప ప్రాంతాల్లో ఇటుకల బట్టీ వ్యాపారం కూడా ఎక్కువగానే జరుగుతోంది. ఇటుకలను కాల్చడానికి ఇష్టారాజ్యాంగా పకృతి వనరులైన పచ్చని చెట్లను అడ్డంగా నరికేస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే పచ్చని మొక్కలన్నీ కూడా కాలిబూడిదయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

పర్యావరణం నాశనం...

అభివృద్ధి పేరుతో పారిశ్రామిక వాడల్లో స్థాపించిన పరిశ్రమల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. చెట్లను నరకడం, వాటి కలపను నిత్యం మండిస్తుండడంతో పర్యావరణం నాశనమై, కాలుష్యం పెరుగుతోంది. పగలూరాత్రీ అన్న తేడా లేకుండా అక్కడ బాయిలర్లు కాలుతునే ఉంటాయి. బాయిలర్లలో వేడిని నింపేందుకు పచ్చని చెట్లను నరికి వాటి కలపను మండిస్తున్నారు. ఇక్కడ నిత్యం కాలిపోతున్న కలప భవిష్యత్తుకు ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. ఈ పరిశ్రమల చుట్టుపక్కల గ్రామాల వారు ఓ వైపు దుమ్మూధూళి, మరోవైపు కాలుష్యంతో సతమతం మవుతున్నారు. పారిశ్రామికవేత్తలు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను అనుభవిస్తూ కోట్లాది రూపాయలను సంపాదించుకుంటున్నారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసిన వారంతా బీహార్, రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాలకే చెందినవారే ఉండడం గమనార్హం. పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కూలీలు కూడా ఇతర రాష్ట్రాల వారే ఉన్నారు. స్థానికుల ఉపాధి కల్పిస్తామన్న హామీ ఇక్కడ మచ్చుకైనా కన్పించదు. ఇక్కడ జరుగుతున్న అనర్థాలను ప్రశ్నించేందుకు వెళ్లే వారిపై దాడులు చేయించేందుకు కూడా పరిశ్రమ యాజమాన్యాలు వెనుకాడడం లేదు. పరిశ్రమలోకి కొత్తవారిని ఎవరినీ రానివ్వకుండా గేటుబయటనే అడ్డుకునేందుకు ప్రత్యేకమైన వ్యక్తులను కూడా ఏర్పాటు చేసుకున్నారు. దీనిని నియంత్రించాల్సిన అధికారులు, ముఖ్య ప్రజాప్రతినిధులు కూడా వారికి వంతపాడుతుండడంతో వారు మరింత రెచ్చిపోతున్నారు. దీంతో పర్యావరణం దెబ్బతిని కాలుష్యం ప్రజలపై దాడి చేసే ప్రమాదం పొంచి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెట్లను అక్రమంగా నరికేసి కలపను తరలించుకుపోతున్న పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ట్రాక్టర్ ద్వారా పరిశ్రమకు తరలిపోతున్న కలప

చెట్లను రక్షించుకుంటేనే భవిష్యత్తు

అడవులతో పాటు చుట్టుపక్కల ఉన్న చెట్లు అంతరిస్తే పర్యావరణానికి విఘాతం ఏర్పడుతుంది. దీని వల్ల భవిష్యత్తు తరాలకు తీరని నష్టం ఏర్పడుతుంది. అటవీ సంరక్షణ చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు కొంతమంది అవినీతికి పాల్పడి చట్టాలను నీరుగార్చేస్తున్నారు. పరిశ్రమల కోసం నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఒక చెట్టువిలువ రూ.70 లక్షలుగా సుప్రీంకోర్టు నిర్ణయించదంటే చెట్టు గొప్పదనం ఏమిటో అర్థం అవుతోంది. అలాంటి చెట్లను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అలాంటి చెట్లను ప్రతి రోజూ వేల సంఖ్యలో నరికేస్తుంటే దానిని అడ్డుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

భాస్కర్‌రెడ్డి, పర్యావరణ పరిరక్షకులు.

నేతన్న సమస్యలపై 'పోలా' ది అలుపెరగని పోరాటం

కార్మిక సరంక్షణకు తపించిన నేత

ఆయన మరణం చేనేతకార్మిక లోకానికి తీరని లోటు

సంస్మరణ సభలో నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

కామ్రేడ్ పోలా రామాంజనేయులు చేనేత కార్మికుల, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణంలో చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిపిఎం రాష్ట్ర నాయకులు ఓబులు, రాంభూపాల్, ఎపి చేనేత కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలక్రిష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు పోలా రామాంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పోలా రామాంజనేయులు చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి చేసిన పోరాటాలను వివరించారు. చేనేత కార్మికుల సమస్యలపై పోరాడుతూ జైలుకు కూడా వెళ్లారన్నారు. పోలా రామాంజనేయులు మృతి చేనేత కార్మిక లోకానికి తీరని లోటని అన్నారు. చేనేత రంగం అంటేనే గుర్తుకు వచ్చే నాయకుడిగా పోలా రామాంజనేయులు కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాల చేశారన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని, ఆశయాలను కొనసాగిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, చేనేత కార్మికసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జింకాచలపతి, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, సిపిఎం జిల్లాకమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, పట్టణ కార్యదర్శి నామాలనాగార్జున, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్. బాషా, అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రైతుసంఘ జిల్లానాయకులు జెవి. రమణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పోలారామాం జినేయులు చిత్రపటానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు.

అంగన్వాడీలపై ప్రభుత్వ నిర్బంధం సరికాదు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీలు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి 25వ తేదీ తలపెట్టిన ధర్నాను విఫలంచేయడానికి ప్రభుత్వం చేస్తున్న పోలీసు నిర్బంధాన్ని, అరెస్టులను సిపిఎం తీవ్రంగా ఖండించింది. విజయవాడలో ప్రజాస్వామ్యయుతంగా జరిగే ధర్నాలో హింస జరుగుతుందనే తప్పుడు ప్రచారాన్ని పోలీసులు చేసి ఎక్కడికక్కడ కార్మికులను అడ్డుకోవడాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి రాంభూపాల్ ఖండించారు. అంగన్వాడీ కార్యకర్తలను ఎక్కడికక్కడ ఇళ్ళవద్దనే అరెస్టులు చేసి నిర్బంధించడం, వాహనాలను అడ్డుకోవడం, ధర్నాకు అనుమతినివ్వకపోవడం అప్రజాస్వామికమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కార్మికులు తమ సమస్యలకోసం గత కొంతకాలంగా వివిధ రూపాలలో ఆందోళన చేస్తున్నారని కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు, ప్రదర్శనలు చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి పూనుకోకుండా నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. తమ న్యాయసమ్మతమైన కోర్కెలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం, నిరసన తెలపడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని అన్నారు. ఆ హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని హరించడమేనని విమర్శించారు. అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలి. వారి న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని, అందుకు సంఘ నాయకులతో చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కురుస్తున్న వర్షాలు

సత్యసాయి జిల్లాలో మోస్తరు

అనంతపురంలో అత్తేసరే..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో శనివారం నాటి నుంచి అక్కడక్కడ వర్షపాతం నమోదవుతోంది. సత్యసాయి జిల్లాలో చాలా మండలాల్లో ఒక మోస్తరు వానలు పడ్డాయి. అనంతపురం జిల్లాలో నాలుగైదు మండలాల్లోక్ల వర్ష ప్రభావముంది. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి ఉమ్మడి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. దీంతో ఖరీఫ్ పంటల సాగు కూడా 50 శాతానికే పరిమితమైంది. అయితే సెప్టంబరు తొలి వారంలో పడినప్పటికీ మధ్యలో రెండు వారాలు వానల్లేకుండా ఉన్నాయి. తిరిగి ఇప్పుడు చివరి వారంలో వర్షాలు పడుతుండటం కొంత ఊరటనిచ్చేదిగా ఉంది.

సత్యసాయి జిల్లాలో మోస్తరు

సత్యసాయి జిల్లాలో ఆదివారం నాడు అనేక మండలాల్లో వర్షం పడింది. సీజన్ మొత్తంగా చూస్తే సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం ఇప్పటి వకు 322.9 మిల్లీమీటర్లుకురవాల్సి ఉండగా 252.8 మిల్లీమీటర్లు నమోదయింది. ఇంకా 21.7 శాతం వర్షపాత లోటుంది. 14 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా ఇంకా 18 మండలాల్లో వర్షాభావం నెలకొని ఉంది.

అనంతలో అత్తేసరే

అపంతపురం జిల్లాలో రెండు రోజులు పడిన వర్షపాతం అంతంత మాత్రంగానే ఉంది. పామిడిలో అత్యధికంగా 61 మిల్లీమీటర్లు నమోదయింది. ఆ తరువాత పెద్దవడుగూరులో 37 మిల్లీమీటర్లు పడింది. తాడిపత్రిలో 34.2 మిల్లీమీటర్లు, పుట్లూరులో 26 మిల్లీమీటర్లు పడింది. తక్కిన చోట్ల నామ మాత్రంగానే వర్షపాతం పడింది.జిల్లా మొత్తంగా చూస్తే 284.5 మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా 205.1 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. 28 శాతం వర్షపాతం లోటుంది. ఇటువంటి పరిస్థితి అనంతపురం జిల్లాలో 1991 తరువాత ఇదేనని వాతావరణ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ తెలిపారు.

గతేడాది కంటే తక్కువే

గతేడాది ఇదే సమయానికి అంటే జూన్ నుంచి సెప్టెంబరు నెల ఇప్పటి వరకు 33 రోజులు వర్షం పడిన రోజులున్నాయి. ఈసారి ఇప్పటి వరకు 26 రోజులే వర్షం పడిన రోజులున్నాయి.పడిన వర్షం కూడా అంతంటా లేదు. అది కూడా నామ మాత్రంగానే ఉంది. రాయదుర్గం, బొమ్మనహాళ్ మండలాల్లో సెప్టెంబరు మాసంలోనూ వర్షపాతం చాలా తక్కువగా నమోదయింది. రాయదుర్గంలో ఈ నెలంతా కలిపి పడిన వర్షపాతం కేవలం 9 మిల్లీమీటర్లు, బొమ్మనహాల్‌లో 13 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. ఇలా అనేక వ్యత్యాసాలతో పంటలపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

నేటి నుంచి కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలు

దీక్షల్లో పాల్గొననున్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం మడకశిర డివిజన్‌లోని కార్మికుల వేతనాలు కాజేసిన కాంట్రాక్టర్లు కలాంనాయుడు, గోవర్ధన్‌రెడ్డిపై చర్యలు తీసుకుని, ఆ డబ్బులు కార్మికులకు చెల్లించేలా చూడాలని డిమాండ్ చేస్తూ నేటి నుంచి కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపట్టనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టనున్న ఈ దీక్షలను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ప్రారంభించనుండగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు దీక్షలో కూర్చొంటారని తెలిపారు. కార్మికుల వేతనాల్లో కోతలు విధించిన సొమ్ము, బోగస్ పేర్లతో అక్రమంగా కాజేసిన నిధులు ఆయా కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేయాలన్నారు. వారి కాంట్రాక్ట్ లైసెన్స్‌లు బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. కాంట్రాక్టర్లకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సహకరించారని ఆరోపణలు ఉన్న నేపథ్యంలో జరిగిన అవినీతి విచారణ కోసం అదే అధికారులను విచారణ అధికారులు నియమించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమగ్ర విచారణ జరిపి అక్రమాలపై నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. కాగా దీక్షల్లో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'కాలవ' నిరవధిక నిరాహారదీక్ష భగ్నం

అరెస్టు చేసిన పోలీసులు

ఖండించిన నాయకులు



కాలవ శ్రీనివాసులును బలవంతంగా జీపులోకి ఎక్కిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - రాయదుర్గం

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని కోరుతూ ఆ పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు రాయదుర్గంలో చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఎన్టీఆర్ సర్కిల్లో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన దీక్షా శిబిరం వద్ద స్థానిక పోలీస్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పోలీసులు అక్కడికే చేరుకున్నారు. శ్రీనివాసులుతో పాటు వందలాదిమంది కార్యకర్తలు నాయకులు కూడా అక్కడ ఉన్నారు. ఇన్స్‌పెక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ నిరవధిక నిరాహార దీక్షకు అనుమతి లేదని, దీక్షను విరమించాలని శ్రీనివాసులకు చెప్పారు. అయితే తమ నాయకుడిని విడుదల చేసే వరకు తన దీక్ష కొనసాగిస్తానన్నారు. అయితే పోలీసులు బలవంతంగా ఆయనను అరెస్ట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అడ్డుకొని నినాదాలు చేశారు. భారీ పోలీసు బలగాలతో శ్రీనివాసులును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజాదరణను ఓర్వలేకనే తప్పుడు కేసు : మాజీ మంత్రి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బస్సు యాత్ర, ఆయన తనయుడు నారా లోకేష్ పాదయాత్రల పట్ల ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా తమ అధినేత చంద్రబాబును అరెస్టు చేసిందని మాజీ మంత్రి పరిటాల సునీత ఆరోపించారు. ఆదివారం రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులును పరామర్శించేందుకు వచ్చిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. తమ నాయకుడు చంద్రబాబును అరెస్టు చేసి 13 రోజులు కావొస్తుందని ఆయనను విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా, రాష్ట్రం వెలుపల ప్రజలు ముందుకు వస్తున్నారని చెప్పారు. రాయదుర్గంలో మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తుండగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు సంఘీభావం తెలిపితే, వైసిపి ఒత్తిడి వల్ల పోలీసులు శ్రీనివాసులు ఆరోగ్యం బాగా ఉన్నప్పటికీ ఆయనను చేస్తున్న దీక్షను భగ్నం చేయడం బాధాకరమని అన్నారు. దీక్షను అడ్డుకునే హక్కు పోలీసులకు లేదన్నారు. చంద్రబాబు వల్లనే రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధి చెందిందన్నారు. ఆయన వల్ల ఆయన ఇప్పించిన శిక్షణ వల్ల అనేకమంది రాష్ట్రంలోనూ, వెలుపలా ఉపాధి, ఉద్యోగం పొందారని చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడం చూసి బాబుకు తోడుగా తాము ఉంటామని అనేకమంది పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపేందుకు ముందుకు వచ్చారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ము ధైర్యం ఉంటే ప్రాథమిక ఆధారాలు చూపి అరెస్టు చేయాలని సవాల్ చేశారు. చంద్రబాబుపై తప్పుడు కేసు బనాయించడం రాజకీయ కక్ష అన్నారు. చంద్రబాబును బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మారనున్న హాస్టళ్ల రూపురేఖలు

సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివరంగ ప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలోని26 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు రూపురేఖలు త్వరలో మారున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివ రంగ ప్రసాద్ పేర్కొన్నారు.. ఆదివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెలుబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు కింద ఏ విధంగా అభివృద్ధి చేశారో అదేవిధంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్ల రూపురేఖలను ఏడాదిలోపు మార్చనుందని చెప్పారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు ఇంటర్నెట్, కలర్ టీవీ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుని ఉన్నట్లు వెల్లడించారు.

ప్రశ్న : శ్రీ సత్య సాయి జిల్లాలో ఎన్ని హాస్టల్లో ఉన్నాయి ? వాటిలో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఎన్ని ?


జవాబు: శ్రీ సత్య సాయి జిల్లాలో 26 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో మూడు నుండి పదవ తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన హాస్టళ్లు బాలురకు 12, బాలికలకు 5 ఉన్నాయి. ఇంటర్మీడియట్ చదివే బాలికలకు ఐదు, బాలురకు నాలుగు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి.

ప్ర : విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు సరిగా అందలేదన్న విమర్శలపై మీ అభిప్రాయం ?

జ: గతంలో మాదిరిగా కాకుండా విద్యార్థులకు నెలనెలా ఇవ్వాల్సిన కాస్మోటిక్ ఛార్జీలను మార్చి 2022 నుండి వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. మెస్ ఛార్జీల విషయానికి వస్తే 2018 నుండి ఇస్తున్న చార్జీలే గతం వరకు అమల్లో ఉండేవి. ఇటీవల మెస్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు మెనూ ప్రకారం సరైన భోజనం అందిస్తున్నాం.

ప్ర : హాస్టళ్లలో సిబ్బందికి బయోమెట్రిక్ విధానం అమలులో ఉందా?

జ : హాస్టల్లో సిబ్బందికి బయోమెట్రిక్ విధానాన్ని అవలంభిస్తున్నాం. దాని ద్వారా ఏ అధికారి విధులకు హాజరు కాకుండా ఉండేందుకు వీలులేదు.



బయోమెట్రిక్ వేస్తే ఉన్నతాధికారులు దృష్టికి వెళుతుంది ఈ తరుణంలో సిబ్బంది హాజరుపై సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో హాజరు శాతం పూర్తిస్థాయిలో ఉంది.

ప్ర : అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు నెలనెలా మంజూరు చేస్తున్నారా ?

జ: సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పరిధిలో రెండు రకాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకటి, మూడు నుండి పదవ తరగతి వరకు ఉన్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఆప్‌కార్డ్ నుండి నెలనెలా వేతనాలు అందుతున్నాయి. జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి నెలనెలా వేతనాలు అందడం లేదు. వారికి మదర్‌థెరిస్సా ట్రస్ట్ నుండి వేతనాలు అందాల్సుంది. ప్రభుత్వం గ్రాంట్ విడుదల చేస్తే మదర్‌థెరిస్సా ట్రస్టుకు బదలాయింపు చేసి వారికి వేతనాలు మంజూరు చేస్తారు. దీంతో వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతోంది.



సాంఘికసంక్షేమ శాఖ పీడీ శివరంగప్రసాద్

ప్ర : హాస్టళ్ల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేవి?

జ : హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోంది. అద్దె భవనాల్లో ఉన్న వసతిగృహాలపై దృష్టి సారించింది..నాడు నేడు కింద శాశ్వత భవనాలు నిర్మించి ప్రస్తుతం ఉన్న హాస్టళ్లను ఉత్తమ స్థాయిలో తీర్చిదిద్దాలన్న దృక్పథంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సౌకర్యవంతంగా హాస్టళ్లను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తోంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

బిఎస్ఎన్ఎల్‌ను కాపాడుకోవడమే లక్ష్యంగా పోరాటం

బిఎస్ఎన్ఎల్ సిసిఇడబ్ల్యూఎఫ్ ఎపి కార్యదర్శి ప్రభాకర్‌రావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బిఎస్ఎన్ఎల్ సిసిఇడబ్ల్యూఎఫ్ ఎపి కార్యదర్శి ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలకు మెరుగైన సేవలు అందించిన బిఎస్ఎన్ఎల్ సంస్థను కాపాడుకోవమే లక్ష్యంగా ఐక్యంగా పోరాడుదామని బిఎస్ఎన్ఎల్ క్యాజువల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ ఫెడరేషన్ (హెచ్-73 సిఐటియు అనుబంధం) ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. నగరంలోని బిఎస్ఎన్ఎల్ సమావేశ మందిరంలో ఫెడరేషన్ ఏపి సర్కిల్ అధ్యక్షులు కరీంబాషా అధ్యక్షతన ఆదివారం బిఎస్ఎన్ఎల్ క్యాజువల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా మొదటి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ ఏర్పడినప్పటి నుంచి సంస్కరణల పేరుతో గతంలో ఎప్పుడూ లేనివిధంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక బిఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేయడానికి అనేక ప్రయత్నాలు చేశారని విమర్శించారు. ప్రయివేట్ సంస్థలతో పోటీగా ప్రభుత్వ సంస్థలను నడపలేకపోయారన్నారు. ప్రయివేట్ సంస్థలను ప్రోత్సహించాలనే పేరుతో బిఎస్ఎన్ఎల్ సంస్థను నిర్వీర్యం చేశారన్నారు. ఇందులో భాగంగానే బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు విఆర్ఎస్ విధానం తీసుకొచ్చారని మండిపడ్డారు. వారి స్థానంలో క్యాజువల్ కాంట్రాక్ట్ కార్మికులను తీసుకొచ్చి వెట్టి చాకిరి చేయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విఆర్ఎస్ తీసుకున్న ఉద్యోగుల స్థానాల్లో కొత్త ఉద్యోగులను భర్తీ చేయకపోవడంతో వారి పనిభారమంతా క్యాజువల్ లేబర్స్‌పై పడుతోందన్నారు. క్యాజువల్ వర్కర్‌లకు 9 గంటల పనితో సంబంధం లేకుండా ఎమర్జెన్సీ సర్వీసుల పేరుతో పని భారం మోపుతున్నారని తెలిపారు. క్యాజువల్ లీవ్‌లు, పని గంటలు అమలు కావడం లేదన్నారు. ఈ రకమైన పద్ధతుల్లో యాజమాన్యాలు శ్రమ దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. సామాజిక భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయకపోవడం, గుర్తింపు కార్డులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కార్యదర్శి ఎం.రామారా వు, బిఎస్ఎన్ఎల్ రెగ్యులర్ ఎంప్లాయీస్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అక్బర్ బాషా, సిఐటి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, బిఎస్ఎ న్ఎల్ క్యాజువల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ ఫెడరేషన్ సహాయ కార్యదర్శి ఇక్బాల్, ఏపి సర్కిల్ ఉపాధ్యక్షులు మల్లికార్జున, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బిఎస్ఎన్ఎల్ క్యాజువల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా అధ్యక్షులు ఎం.తిరుమలయ్య, ప్రధాన కార్యదర్శి ఏ.జగదీష్ నాయుడు, కోశాధికారి వెంకటేష్ నాయక్, ఉపాధ్యక్షులు ఎస్.మహమ్మ ద్, ఎన్.రమేష్, సి.యోగానంద, పి.నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు వై.ఎల్లప్ప, కె.రమేష్, జి.శ్రీనివాసు లు, ఎస్.కుళ్లాయప్ప, పి.రామస్వామి, ఎస్.నల్లప్ప, డి.గౌస్ పీర్, ఎం.నారాయణస్వామి, సి.కళ్యాణ్‌ను ఎన్నుకున్నారు.

సిబిఐ కాదు.. ఇంటర్‌పోల్‌తో దర్యాప్తు చేసుకోండి

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు


విలేకరులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ శిక్షణ ఒప్పందం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సిబిఐతో కాకుంటే ఇంటర్‌పోల్ సంస్థతో దర్యాప్తు చేయించినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రాయదుర్గంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు చంద్రబాబు అరెస్టు పట్ల పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. తాను రాయదుర్గంలో రెండు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తుండగా ఆరోగ్యం బాగా ఉన్నప్పటికీ, ఆక్సిజన్ లెవెల్స్ పడిపోయాయని అర్ధరాత్రి పోలీసులు వచ్చి దీక్షను భంగ్నం చేశారన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉందన్నారు. తమ నాయకుడికి జరిగిన అన్యాయాన్ని ప్రజలకు చాటేందుకు ఆమరణ దీక్ష చేస్తే అన్యాయంగా పోలీసులు దీక్షను భగ్నం చేయడం బాధాకరమన్నారు. చంద్రబాబు ఏ తప్పు చేయలేదని, చేసే వ్యక్తి కాదన్నారు. పాతికేళ్లుగా ఆయనతో సన్నిహితంగా ఉండటం వల్ల తనకు బాగా తెలుసు అన్నారు. ఎల్‌వి సుబ్రమణ్యం, పివి రమేష్ లాంటి ప్రభుత్వ సీనియర్ ఉన్నతాధికారులు కూడా చంద్రబాబు వ్యవహార శైలి పట్ల తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారన్నారు. నిజాయితీ, నిబద్ధతకు నిదర్శనమైన చంద్రబాబును రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైల్లో బంధించిందన్నారు. అలా చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుపడాన్నారు. గత 45 సంవత్సరాలుగా రాష్ట్ర, జాతీయ రాజకీయాలలో తనదైన శైలి ముద్ర వేయించుకున్న చంద్రబాబు దేశ, విదేశాల్లో తెలుగువారి ప్రతిష్టను పెంచారన్నారు. ప్రతిపక్ష నేతగా ఆయన కదలికలపై ప్రభుత్వం నిఘా ఉంచి వేధింపులు, మానసిక క్షోభ కు గురి చేశారన్నారు. అలాంటి వ్యక్తికి ఇలాంటి కష్టాలు రావడం విచారకరం అన్నారు. రూ.43 వేల కోట్ల అవినీతి కుంభకోణంలో, 31 కేసుల్లో ఏ.1గా ఉన్న సిఎం జగన్ 10 సంవత్సరాలుగా చట్టాల్లోని లోపాలను ఉపయోగించుకుని కోర్టు వాయిదాలకు కూడా పోకుండా వ్యవస్థలను శాసిస్తూ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నాడని విమర్శించారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు వారి ఆత్మసాక్షికి జవాబుదారీగా పని చేసి ప్రజలు అందరూ ఒక్కటై చంద్రబాబుకు తోడుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. జగన్ రాష్ట్ర భవిష్యత్తును సర్వనాశనం చేశారన్నారు. ఇది రాష్ట్ర భవిష్యత్తుకు వచ్చిన సమస్య అని అందరూ ఆలోచించాలన్నారు. ప్రజాస్వామ్యానికి జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారన్నారు. ఈ సమయంలో అందరూ ఒకటై పదేళ్లుగా కోర్టు మెట్లు ఎక్కకుండా ఉన్న బయట తిరుగుతున్న ఆర్థిక నేరస్థుడు జగన్‌ను రాష్ట్రం నుండి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పురుషోత్తం, వెంకటేశులు, నాగరాజు, మహబూబ్ బాషా, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు

పరామర్శించేందుకు వెళ్లిన సిఐటియు నేతల నిర్బంధం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా జిల్లా పోలీసులు ఎక్కడికక్కడ అంగన్‌వాడీ కార్మికులను అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. జిల్లావ్యాప్తంగా అరెస్టులు కొనసాగాయి. ముఖ్యంగా అనంతపురంలో అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ నగర అధ్యక్షురాలు జయభారతి, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ తదితరులను మూడవ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌లో పెట్టారు. వీరిని పరామర్శించేందుకు వెళ్లిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్‌ను కూడా పోలీసులు అక్కడే నిర్బంధించారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం ఇలా అక్రమ అరెస్టులు అడ్డుకోవడం సరికాదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

వందేభారత్ రైలు ప్రారంభం


వందేభారత్ రైలును ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి వందే భారత్ రైలును ప్రారంభించారు. హైదరాబాదు నుంచి బెంగళూరు వరకు ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన వందేభారత్ రైలు ఆదివారం అనంతపురం రైల్వే స్టేషన్ మీదుగా బెంగళూరుకు వెళ్లింది. ఈ సందర్భంగా అనంతపురం రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైలును ఆహ్వానిస్తూ ఘన స్వాగతం పలికారు. కోలాహలం నడుమ ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం, బిజెపి జిల్లా అధ్యక్షులు అంకిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు చిరంజీవి రెడ్డి, రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.అశోక్ కుమార్‌లు హాజరై జెండా ఊపి రైలును అనంతపురం నుంచి ప్రారంభించారు. అంతకు మునుపు ఎంపీ మాట్లాడుతూ భారత ప్రభుత్వం సాధించిన ఘనత వందే భారత్ రైలు అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రోత్సాహంతోనే వందే భారత్ రైలు సాకారం జరిగిందన్నారు. భారత ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రయాణికులు తక్కువ సమయంలోనే గమ్యానికి చేరుకోవచ్చు అన్నారు. కిసాన్‌రైల్ సేవలు కూడా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.అశోక్ కుమార్ ప్రయాణికులకు విమానంలో ప్రయాణిస్తున్న అనుభవం కలుగుతుందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు కూడా సైకిల్ పెట్టుకునేలా సౌకర్యాలు కల్పించారని తెలిపారు. ఆటోమెటిక్ డోర్ బయోమెట్రిక్ టాయిలెట్స్ ఉంటాయని తెలిపారు.

కొరటాల సత్యనారాయణ బాటలో నడుద్దాం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి


అనంతపురంలో కొరటాలకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి కొరటాల సత్యనారాయణ ఆశయాల బాటలో మనమందరం నడద్దామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొరటాల సత్యనారాయణ శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ నిత్య అధ్యయన శీలి, సమస్యల పట్ల సమగ్ర అవగాహన ఉన్న నాయకుడు అన్నారు. సమాజంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేసి అందుకు తగ్గట్టుగా సంఘాలను ఏర్పాటు చేసి ప్రజలను కదిలించేవారన్నారు. కొరాటాల ఆశయాలు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. కొరటాల జన్మించి నేటికి 100 సంవత్సరాలు పూర్తయిందన్నారు. 1923 సెప్టెంబర్ 24వ తేదిన గుంటూరు జిల్లా అమృతలూరు మండలం, ప్యాపర్రు గ్రామంలో బుచ్చయ్య, శేషమ్మ దంపతులకు జన్మించారన్నారు. పుట్టింది భూస్వామ్య కుటుంబంలోనైనా పెరిగింది ప్రజల మధ్య, పని చేసింది శ్రామిక జనం కోసమే అన్నారు. హైస్కూలులోనే డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా 11 రోజుల విద్యార్థుల సమ్మెకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. గుంటూరు ఏసి. కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరి మధ్యలోనే చదువు ఆపేసి ప్రజా ఉద్యమాలకు తన యావత్ జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. నాటి నుంచి ఆఖరి శ్వాస వరకు మార్క్సిస్టు, లెనినిస్టు సిద్ధాంతంపై అత్యంత విశ్వాసంతో ఉంటూ కమ్యూనిస్టు పార్టీలో తొలుత ఉమ్మడి సిపిఐ తరువాత సిపిఐఎంలో పని చేశారని గుర్తు చేశారు. 1946-48 మధ్య తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం సాగుతున్న రోజుల్లో ఆంధ్ర ప్రాంతంలో దానికి మద్దతుగా నిలబడి జైలుపాలయ్యాడని తెలిపారు. 1948లో అరెస్టై కడలూరు జైలులో గడిపారని తెలిపారు. గుంటూరు జిల్లాలో బంజరు భూములు, లంక భూములు కోసం పేదలను కదిలించి పోరాటాలు నిర్వహించారని తెలిపారు. వ్యవసాయ కూలీల వేతనాల పెంపు కోసం పోరాడారని తెలిపారు. కొరటాల ఆశయ బాటలో నడవడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, బి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు వి.రామిరెడ్డి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.కృష్ణమూర్తి, వై.వెంకటనారాయణ, టి.రామాంజినేయులు, ఎస్.భాస్కర్, జి.జగన్, వి.నిర్మల, ఎ.రంగారెడ్డి, బి.అబ్యుత్, సూర్యచంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, పి.శ్రీనివాసులు, ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి ఎం.రామయ్య శివశంకర్, రమేష్, దాసరి శ్రీనివాసులు, సాకే నాగరాజు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు మారుతీప్రసాద్ అన్నారు. కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక సిఐటియు కాలనీలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ గుంటూరు జిల్లా అమృతలూరు మండలం ప్యాపర్ల గ్రామంలో ధనిక కుటుంబంలో జన్మించారన్నారు. ఆయన చిన్న వయసులోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీలో చేరి ప్రధానంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశారన్నారు. అదేవిధంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎన్నో ఉద్యమ పోరాటాలు చేశారన్నారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడడానికి కీలకపాత్ర పోషించి పార్టీ సభ్యులుగా, మండల కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా పార్టీలో పని చేశారన్నారు. ఆయన బతికి ఉన్నంత వరకూ పేద, రైతాంగ, మహిళ సమస్యలపై పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఎన్నో సంవత్సరాలు జైలు జీవితం, అజ్ఞాతవాసం అనుభవించారన్నారు. అంతేగాకుండా ప్రజాశక్తి దినపత్రిక అభివృద్ధిలో చాలా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, ఓబులేసు, కెవిపిఎస్ నాయకులు సూరి, మునిస్వామి, శీనానాయక్, చంద్రానాయక్, మున్సిపల్ యూనియన్ నాయకులు కృష్ణ, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఉరవకొండ నియోజకవర్గ నూతన కమిటీ సభ్యులు

వైసిపి నియోజకవర్గ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలో నూతనంగా ఎంపికైన వైసిపి నియోజకవర్గ కమిటీ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య మాట్లాడుతూ వైసిపిని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలన్నారు. ముఖ్యంగా అధినేత జగన్‌ను మరోసారి సిఎంను చేసుకోవడమే మనందరి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్‌యాదవ్, వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ రామచంద్ర, ఎంపిపి పెద్దన్న, జడ్పిటిసి భర్త త్రిలోకనాథ్‌రెడ్డి, నాయకులు వీరన్న, రమణ, మచ్చన్న, కరుణాకర్, శివలింగప్ప, జి.శ్రీనివాసులు, రామాంజనేయులు, పుష్పావతి, రేఖమ్మ, వెంకటరెడ్డి, రుద్రానందగోపాల్, అశోక్, హనుమంతురాయుడు, పాతన్న, బాబురెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లపట్టాలు : విప్ కాపు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

అర్హులైన నిరుపేదలందరికీ స్థలంతోపాటు ఇళ్లు మంజూరు చేస్తున్నామని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ఎలంజి గ్రామంలో 32 మందికి మంజూరైన జగనన్న ఇంటి పట్టాలను విప్ కాపు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా ఇల్లుగానీ, స్థలంగానీ లేకపోతే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో విచారణ చేపట్టి ఇంటి పట్టాతోపాటు ఇంటిని మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. అంతేకాకుండా ప్రతి పేదవాడూ బాగుండాలనేది సిఎం జగన్ లక్ష్యమన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ వన్నల్లు రామాంజనేయులు, కొలగానహళ్లి ఎంపిటిసి తిమ్మప్ప, తహశీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆర్థికాభివృద్ధిలో కార్యదర్శులు కీలకం

జిల్లా పంచాయతీ అధికారి కె.ఎల్.ప్రభాకర్‌రావు


శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శి ముత్యాలరెడ్డికి సర్టిఫికెట్ అందజేస్తున్న డిపిఒ ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

గ్రామ పంచాయతీల ఆర్థికాభివృద్ధికి కార్యదర్శులు కీలకంగా పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి కె.ఎల్.ప్రభాకర్‌రావు సూచించారు. ఆదివారం స్థానిక టిటిడిసి శిక్షణా సంస్థలో జిల్లాకు చెందిన 1వ గ్రేడ్ నుంచి 5వ గ్రేడ్ వరకూ ఉన్న పంచాయతీ కార్యదర్శులకు 4వ విడత శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు రోజుల శిక్షణ తీసుకున్న పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ పరిపాలన, పంచాయతీ పరిధిలోని లే అవుట్లు, బిల్డింగులు, డూమ్, సీసీఏ రూల్స్, రిజిస్టర్ల నిర్వహణ, ఉపాధి హామీలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణలో పొందిన అనుభవాలను పంచాయితీ అభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. అనంతరం శిక్షణ తీసుకున్న పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహా, నిర్మల్‌దాస్, డిటిఎం పి.సదాశివ, జి.రామాంజనేయులు, నరసింహారెడ్డి, ఎస్.పి.రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్ఆర్ జలకళ' మోటార్లు పంపిణీ


మోటార్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

బెలుగుప్ప : మండల కేంద్రంలోని స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో వైఎస్ఆర్ జలకళ పథకం కింద మంజూరైన బోరుబావి మోటార్లను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. బెలుగుప్ప, ఎర్రగుడి, శీర్పి, అంకంపల్లి, ఆవులెన్న, గంగవరం, రామసాగరం గ్రామాలకు చెందిన 10 మంది రైతులకు మోటార్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల్లో బోరుబావులను ఏర్పాటు చేసుకుని పంటలు సాగు చేసుకోవాలన్న రైతుల కలను వైఎస్ఆర్ జలకళతో సిఎం జగన్ సాకారం చేశారన్నారు. బోరుబావి తవ్వకం మొదలు, విద్యుత్ కనెక్షన్, మోటారు పంపులను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కల్పిస్తూ రైతు పక్షపాతిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జలకళ సిబ్బంది, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనులకు భూములివ్వాలి

ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి


మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి

ప్రజాశక్తి-ఉరవకొండ

దళిత, గిరిజనలకు సాగు భూములు దక్కేంత వరకూ పోరాటం చేస్తామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. ఆదివారం ఉరవకొండలోని ఆర్‌అండ్‌బి అథితి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిక శాతం భూములు కొందరి చేతుల్లో బందీగా ఉన్నాయన్నారు. దీంతో నిరుపేదలకు భూములు కరువయ్యాయని వాపోయారు. పేదరిక నిర్మూలన జరగాలంటే నిర్ణీత భూహక్కు కల్పించి ప్రతి నిరుపేదకూ భూపంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీ చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రయోజనం శూన్యమన్నారు. 8 విడతల పంపిణీ మాయమాటలన్నారు. ఎవరికి పంచారో లెక్కలు చూపాలని ప్రశ్నించారు. నమ్మించడానికి అరకొరగా కొండలు, గుట్టలు, వంక పోరంబోకు భూములను ఎస్సీ, ఎస్టీలకు కట్టబెట్టి చేతులు దులుపుకున్నారన్నారు. నేటికీ చస్తే కనీసం పూడ్చడానికి శ్మశాన వాటికలు లేవంటే ఎవరు సిగ్గుపడాలో పాలకులే చెప్పాలన్నారు. స్వేచ్ఛ, హక్కులు, సమానత్వం కోసం పూలే, అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చాబల సురేష్‌బాబు, దాసరి రామాంజనేయులు, ప్యాపిలి తిప్పయ్య, ఎర్రిస్వామి, ఓబులేసు, బ్రాహ్మణపల్లి దొనతిమ్మప్ప, యోగానంద, సీతారాములు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్తు

12వ రోజుకు చేరిన రిలే దీక్షలు


అనంతపురంలో రిలేదీక్షలు చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న అన్నారు. బాబుకు తోడుగా ఒక సైకో పై పోరాటానికి మేము సైతం అంటూ టిడిపి అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఆధ్వర్యంలో కమ్మభవన్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికార దాహంతో టిడిపి నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులు గురి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా జైలుకు పంపించిందన్నారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని, చంద్రబాబు నాయుడు త్వరలోనే జన సందోహంలోకి వస్తారన్నారు. ఈ దీక్షలో క్లస్టర్ నాయకులు మనోహర్, ఆదిశేషు, గంగవరం బుజ్జి, ఈడిగ మారుతి గౌడ్, గుజ్జల పరంధామ, మారన్న, శీనా నాయక్, మల్లికార్జున, సాకే ధనుంజయ, సూరజ్, సోము, రాజు, కిరణ్, హసీనా, కవిత, సుజాత, దీక్షలో పాల్గొన్నారు.

పలువురి సంఘీభావం

బాబు గారికి తోడుగా ఒక నియంతపై పోరాటానికి మేము సైతం దీక్షలకు పలువురు టిడిపి శ్రేణులు సంఘీభావం ప్రకటించారు. టిడిపి సీనియర్ నాయకులు గౌస్‌మొద్దీన్, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, పోతుల లక్ష్మీనరసింహులు, నారాయణస్వామి యాదవ్, జేయం భాష, రాజారావు, బొమ్మినేని శివ, పరంధామ, గోల్ల సుధాకర్ నాయుడు, లింగారెడ్డి, బోయపాటి బాలప్ప, కుంచెపు వెంకటేష్,, చిరోళ్ళరామాంజనేయులు, హాజీ వలీ, దూదేకుల రఫీ, తెలుగు మహిళలు విజయ శ్రీ రెడ్డి, సరళ, శరీనా, వెంకటలక్ష్మి, వరలక్ష్మి,, కవిత, బుజ్జి పద్మావతి, అలివేళమ్మ తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

గుంతకల్లు : సిఎం జగన్ సారథ్యంలో రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, జనసేన జిల్లా నాయకులు వాసగిరి మణికంఠ విమర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆదివారం పట్టణంలోని అజంతా సర్కిల్ నుండి ఎన్టీఆర్ కూడలి వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని, ప్రజాస్వామ్యన్ని కాపాడాలని, సైకో పోవాలి.. సైకిల్ రావాలి.. అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో టీడీపీ, జనసేన, సిపిఐ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వినాయక నిమజ్జనం

నార్పల : మండల కేంద్రంలో కొలువైన వినాయక ప్రతిమలను ఆదివారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం నుంచి మండల కేంద్రంలోని పలు వీధుల గుండా వినాయక ప్రతిమలను ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు, యువకులు, ప్రతిమల ముందు నృత్యాలు చేస్తూ అలరించారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి


వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ జనార్ధన

ఆత్మకూరు : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ఐ కె.జనార్ధన సూచించారు. ఆదివారం మండల పరిధిలోని వడ్డుపల్లి టోల్‌ప్లాజా వద్ద కళ్యాణదుర్గం-అనంతపురం జాతీయ రహదారిపై రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని, హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనం నడపకూడదని, అతివేగంతో వెళ్లకూడదని, వాహనాలకు సంబంధించిన పత్రాలను దగ్గరే ఉంచుకోవాలని కోరారు. ఆయా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమేదారు బాబూనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

98 డీఎస్సీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి


విప్ కాపు రామచంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న 1998 టీచర్లు

ప్రజాశక్తి-రాయదుర్గం

1998 డిఎస్సీ ద్వారా ఎంటిఎస్ టీచర్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విప్ కాపు రామచంద్రారెడ్డిని ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 98 డీఎస్సీ ద్వారా ఎంపికైన తమకు పాతికేళ్ల తర్వాత ఉపాధ్యాయులుగా పనిచేసే అవకాశాన్ని సీఎం జగన్ కల్పించారన్నారు. అయితే చాలామంది పదవీ విరమణకు సమీపంలో ఉండగా, కొంతమంది ఇదివరకే పదవీ విరమణ చెందినట్లు తెలిపారు. ఇతర ఉపాధ్యాయుల మాదిరి తమకు కూడా పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఇందుకు విప్ స్పందిస్తూ సమస్యను సీఎం, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో నియోజకవర్గంలోని ఎంటిఎస్ ఉపాధ్యాయులు శర్మస్‌సాబ్, యూనస్, ఎర్రిస్వామి, ముస్తూర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో 67వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన కేశవరెడ్డి తన బంధువుల వివాహానికి ద్విచక్ర వాహనంలో తొండపాడుకు వచ్చాడు. కళ్యాణ మండపం వద్దకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా తాడిపత్రి వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగాయపడ్డ కేశవరెడ్డిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.